క్లుప్తంగా

రేపటి నుంచి 'గడప గడపకు'



పార్టీ అధ్యక్షుడు పైల పోతురాజు

నాతవరం: మండలంలో చమ్మచింత పంచాయతీలో ఈనెల 4వ తేదీ నుంచి గడప గడపకు మన ప్రభుత్వం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ ఆధ్వర్యంలో జరుగుతుందని పార్టీ మండల అధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ 4, 5 తేదీల్లో చమ్మచింత, 6,7, తేదీల్లో వల్సంపేట, 8,9,10 తేదీల్లో గన్నవరం , 11,12,1,3 తేదీల్లో మన్యపురట్ల సచివాలయ పరిధిలో గల శివారు పంచాయతీలో నిర్వహిస్తామన్నారు. పార్టీశ్రేణులు, అధికారులు విధిగా హాజరవ్వాలన్నారు.

నేటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాలు

దేవరాపల్లి: పెదనందిపల్లిలో శ్రీ గోవిందమాంబ సమేత మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సప్తమి వార్షికోత్సవ వేడుకలను శుక్రవారం నుండి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆఖరి రోజు స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిపి, మధ్యాహ్నం నుండి భారీ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ

నర్సీపట్నం: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందుతున్నది లేనిదీ క్షేత్ర స్థాయి పరిశీలన చేస్తున్నామని జెడ్పీ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ తెలిపారు. గురువారం నర్సీపట్నం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఎంపీడీవో జయమాధవిని అడిగి పలు అంశాలు తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అర్హత ఉండీ పథకాలు అందలేదన్న ఫిర్యాదులు రాకుండా అధికారులు బాధ్యతగా పని చేయాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన జెడ్పీ నిధుల పనులను పర్యవేక్షించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాకవరపాలెం: కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నర్సీపట్నం విద్యుత్ శాఖ డీఈ సురేష్‌బాబు గురువారం తెలిపారు. సబ్ స్టేషన్‌కు మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. అలాగే రామన్నపాలెం, భీమబోయినపాలెం ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని సూచించారు.

రోలుగుంటలో..

రోలుగుంట: మండల కేంద్రం రోలుగుంట 33/11 కేవీ ఫీడర్ లైన్‌కు నేడు (శుక్రవారం) మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నర్సీపట్నం ఈఈ గున్నా సురేష్‌బాబు తెలిపారు. రోలుగుంట, శరభవరం, కొంతలం, బోగాపురం, కొమరవోలు, కె.నాయుడుపాలెం, కొవ్వూరు, అంట్లపాలెం, కంచుగుమల, కొండపాలెం, పడాలపాలెం , చెట్టుపల్లి, వెలంకాయలపాలెం, నిండుగొండ, ఎస్.కొత్తూరు, రాజుపేట, మునిపల్లి, గురందొరపాలెం, నగరం, వడ్డిప, రాజన్నపేట, గొల్లపేట, బుచ్చింపేట, గుర్రంపేట తదితర గ్రామాలతో పాటు సన్‌వుడ్ కార్పొరేషన్, ఓలం ఆగ్రో ప్రైవేట్ స్టోన్ క్రషర్ బిట్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నూతన పింఛన్ల పంపిణీ

చీడికాడ: మండలంలోని తునివలస సచివాలయం పరిధిలో తునివలస, వింటిపాలెం గ్రామాలకు చెందిన ముగ్గురికి ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు సహకారంతో నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు సర్పంచ్ పడాల హైమావతి తెలిపారు. వీరికి గురువారం ఉదయం పింఛన్లు అందించామన్నారు.లబ్ధిదారుల తరుపున బూడికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. మాజీ సర్పంచ్ పడాల అప్పలనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, ఉప సర్పంచ్ విశ్వారపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు

- ఖర్చు తక్కువ ఫలితం ఎక్కువ
- నేల సారం కూడా పెరుగుతుంది



తారువ ఎంపీపీ పాఠశాలలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న స్వామినాయుడు

దేవరాపల్లి: ఆరోగ్యకరమైన పంట దిగుబడులకు ప్రకృతి వ్యవసాయం ఎంతో దోహదపడుతుందని ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్) అడిషనల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆర్‌వీ స్వామినాయుడు అన్నారు. తారువ ఎంపీపీ పాఠశాలలో సూర్యమండలం ఆకారంలో 14 రకాల కాయగూరలను సాగు చేసే విధానంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ విధానం ద్వారా ఒక కుటుంబానికి సరిపడా ఆకుకూరలు, దుంప, తీగ జాతి కాయగూరలు పండించుకోవచ్చన్నారు. ప్రజలచే ప్రకృతి వ్యవసాయం చేయించడమే తమ సంస్థ ధ్యేయమని, ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో అధిగ దిగుబడులు పొందవచ్చన్నారు. ఇలా కాయగూరలు సహా పలు రకాల పంటలను సాగు చేయడం ద్వారా నేల సైతం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది బి. అప్పలరాజు, గోవిందు, పి. చెల్లయ్యమ్మ, ఎస్. మరిడినాయుడు, ఎల్. కృష్ణవేణి, పి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీ కేశవస్వామి కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కేశవస్వామి వారికి కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

చోడవరం: శ్రీదేవి, భూదేవి సమేతుడైన శ్రీ కేశవస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వామివారి 750వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వారం పాటు చోడవరం కేశవస్వామి ఆలయంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా స్వామివారి కల్యాణం బుధవారం అర్ధరాత్రి అంగరంగవైభవంగా జరిగింది. ఆస్థాన అర్చకులైన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు స్వామివారి కల్యాణం జరిపించారు. భక్తులంతా కనులారా చూసి తరించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఉత్సవ కమిటీ చైర్మన్ అలమండల ఈశ్వరరావు పాల్గొన్నారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుమల, తిరుపతి దేవస్థానం దాస సాహిత్య ప్రాజెక్టు బృందం పురందరదాసు కీర్తనలు ఆలపించారు. సంపూర్ణ సుందరకాండ పారాయణ చేశారు.

నూతన శివలింగం ఏర్పాటుకు చర్యలు



పగిలిన శివలింగాన్ని తొలగించిన వైనం

రావికమతం: కళ్యాణపులోవ గ్రామంలో ఉన్న శివాలయంలో పగిలిన శివలింగాన్ని రెండు రోజుల క్రితం శాస్త్రోక్తంగా కాకినాడకు చెందిన దేవదాయ శాఖ స్థపతి శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో తొలగించారు. ఆ స్థానంలో మరొక పెద్ద శివలింగాన్ని, నందీశ్వరుని ఏర్పాటుతో పాటు వినాయక విగ్రహం, ఉత్తర చండీశ్వరుని విగ్రహం, ధ్వజ స్తంభం ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఈ నెల 10న ముహూర్తం నిర్ణయించారు. అయితే దీనిపై కొంత మంది నాయకులు లేని పోని ఆరోపణలు చేస్తున్నారని అవన్నీ అవాస్తవాలని ఆలయ ఈవో బీవీఎస్ఎస్ మురళీకృష్ణ గురువారం తెలిపారు. కొన్నాళ్ల క్రితం భక్తులు కొబ్బరికాయలు కొట్టినప్పుడు శివలింగం పగిలిపోయిందని అన్నారు. తాము మరొక శివలింగం సమర్పించుకుంటామని రోలుగుంట మండలం కుసర్లపూడికి చెందిన భక్తులు పచ్చిగోళ్ల ఈశ్వరరావు, రామచంద్రరావు, భావనారాయణ ఎండోమెంటు అధికారులకు దరఖాస్తు చేసుకోవడంతో వైదిక శాస్త్రం ప్రకారం వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని.. తప్పుడు ప్రచారం మానుకోవాలని అన్నారు.

హౌసింగ్ లబ్ధిదారులకు ఎల్‌పీసీల పంపిణీ



లబ్ధిదారులకు ఎల్‌పీసీలు అందజేస్తున్న తహసీల్దార్ రత్నం, సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్: మండలంలోని కేజే పురంలో కొత్తగా మంజూరైన హౌసింగ్ లబ్ధిదారులకు గురువారం ఎల్‌పీసీలు అందజేశారు. ఎల్‌పీసీలు అందుకున్న వారిలో కొత్తగా 146 మంది ఉన్నారు. వీరిలో 76 మందికి తహసీల్దార్ పీవీ రత్నం చేతుల మీదుగా ఎల్‌పీసీలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జామి రమణబాబు, ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ, నాయకులు ఆడారి కన్నారావు, కాళ్ల అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, భీశెట్టి జగ్గప్పారావు, రాపేట గోవింద, హౌసింగ్ ఏఈ లెక్కల సత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శి పెంకి శివ, వీఆర్‌వోలు కాళింగ రామునాయుడు, నాగప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌తో పారుడు వ్యాధికి అడ్డుకట్ట



కొరువాడలో మేకలకు వ్యాక్సినేషన్ చేస్తున్న పశువైద్యాధికారి నాయుడు



ఎం. అలమండలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశు వైద్యాధికారి మంజూష

కె.కోటపాడు : గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి రాకుండా ఉండేందుకు ముందస్తుగా పీపీఆర్ వ్యాక్సినేషన్ చేస్తున్నట్లు కొరువాడ పశువైద్యాధికారి సీహెచ్‌వై నాయుడు తెలిపారు. ఈ నెల 1 నుండి 28 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా కొరువాడ, గవరపాలెం , పిండ్రంగి గ్రామాల్లో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతు పారుడు వ్యాధి వలన అధిక జ్వరం, ముక్కు వెంట నీరు కారడం, మేత తగ్గించడం, నీరసించిపోయే లక్షణాలు ఉంటాయని, మరణాలు కూడా సంభవించవచ్చన్నారు. పీపీఆర్ వ్యాక్సినేషన్‌ను పెంపకం దారులు తప్పకుండా వేయించాలని ఆయన సూచించారు. పశుసంవర్ధకశాఖ ఉచితంగా వ్యాక్సినేషన్ చేస్తుందన్నారు. చౌడువాడ, కొరువాడ పశువైద్య కేంద్రాల పరిధిలో గల గ్రామాల్లో రెండు రోజులకు 1170 గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట వెటర్నరీ అసిస్టెంట్ వరలక్ష్మి ఉన్నారు.

ఎం. అలమండలో..

దేవరాపల్లి: గొర్రెలు, మేకల్లో పారుడు వ్యాధి నివారణకు తప్పనిసరిగా పీపీఆర్ టీకాలు వేయించాలని ఎం. అలమండ పశువైద్యాధికారి కె.మంజూష తెలిపారు. గురువారం జరిగిన టీకా కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. నెలాఖరు వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. నాలుగు నెలల వయసు పైబడిన గొర్రెలు, మేకలకు టీకాలు వేసి.. వాటి చెవులకు ట్యాగ్‌లు వేయనున్నట్లు ఆమె తెలిపారు.

బీసీ కాలనీలో అన్నసమారాధన



బీసీ కాలనీలో అన్నసమారాధనలో పాల్గొన్న స్థానికులు

మాకవరపాలెం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా ఇక్కడి దుర్గామల్లేశ్వరస్వామి ఆలయం వద్ద బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం అన్న సమారాధన ఏర్పాటు చేయడంతో భారీగా గ్రామస్తులు హాజరై ప్రసాదం స్వీకరించారు.

వామలింగేశ్వర ఆలయంలో..

ఆరుద్ర నక్షత్రం సందర్భంగా గురువారం వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. ఈ కార్యక్రమాల్లో ఆలయాల అర్చకులు మల్లికార్జునశర్మ, దొరబాబుశర్మ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

యలమంచిలి : విద్యార్థులు పరిసరాల శుభ్రత విధిగా పాటించాలని హెచ్‌ఎం శోభారాణి అన్నారు.పురుషోత్తపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రజారోగ్యంపై స్థానిక సచివాలయ సిబ్బందితో కలసి గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బాల్యవివాహాలు, యుక్త వయస్సులో కలిగే మార్పులు, రక్త హీనత, రుతుచక్రం సమస్యలపై బాలికలకు వివరించి తగు జాగ్రత్తలు వివరించారు. హెచ్‌ఎం శోభారాణి మాట్లాడుతూ విద్యార్థులు మానసికంగా ఆరోగ్యంగా దృఢంగా ఉండి పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్య సూచనలు పాటించాలని తెలిపారు.

అనుమతి లేని ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రావికమతం: చినపాచిల గ్రామ శివారులో ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నామని రావికమతం ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు గురువారం తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.10 వేలు చొప్పున అపరాధ రుసుము విధించామన్నారు.

ఆభరణాల చోరీపై విచారణ

చీడికాడ: మండలంలోని అప్పలరాజుపురం శ్రీలలితాదేవి ఆలయంలో జరిగిన వెండి ఆభరణాల చోరీపై గురువారం క్లూస్ టీమ్‌తో పరిశీలించినట్లు ఎస్సై సుధాకరరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీలలితాదేవి ఆలయంలో అమ్మవారికి చెందిన సుమారు 112 తులాల.. సుమారు రూ. 24 వేల విలువ గల వెండి కిరీటం, వెండి అభయహస్తం చోరీకి గురైనట్లు బుధవారం గుర్తించి సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు ఫిర్యాదు చేశారన్నారు. దాంతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకరరావు తెలిపారు.

వైభవంగా పుష్పయాగం

పాయకరావుపేట : పట్టణంలో గల శ్రీరాధారుక్మిణీ సహిత పాండురంగ స్వామి దేవస్థానంలో గురువారం పుష్పయాగం నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించి, పుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ అర్చకులు యియ్యుణ్ణి కృష్ణస్వామి పూజలు చేశారు. ఈవో వెంకటాద్రి తీర్థ ప్రసాదాలు అందించారు.

ఘనంగా నృసింహ కల్యాణం



మంగళధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

చీడికాడ: మండలంలోని అర్జునగిరి స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనృసింహ స్వామి కల్యాణ మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గురువారం ఉదయం నుంచి స్వామికి సహస్ర తులసి పూజలు, రాజ్యలక్ష్మీదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు చేసినట్లు ఆలయ అర్చకులు పానంగపల్లి శ్రీనివాసాచార్యులు తెలిపారు. తిరువీధి పల్లకి సేవ అనంతరం కల్యాణం జరిపించామన్నారు. సర్పంచ్ దంపతులు బి.రమాశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడవిరాజులబాబు పండగ



ఆలయానికి తరలి వెళ్తున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో అడవిరాజులబాబు పండగ వైభవంగా జరిగింది. పాపయ్యపాలెం, బుచ్చన్నపాలెం, ముషిడిపాలెం, బూరుగుపాలెం, పైడిపాల, తూటిపాల, మామిడిపాలెం తదితర గ్రామాల్లో ప్రజలు పండగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



గవరపాలెం అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థికసాయం అందిస్తున్న అనురాధ

కె. కోటపాడు: అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అన్నారు. గవరపాలెంలో మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము, పశువుల పాక లు, రెండు పాడి గేదెలు దగ్ధమయ్యాయి. ప్రమాద బాధితులైన మూడు కుటుంబాల వారిని గురువారం జెడ్పీటీసీ పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా కక్కల అప్పలనాయుడు కుటుంబానికి రూ. 5000, పారుపల్లి, సిమ్మ అర్జున కుటుంబాలకు చెరో రూ. 3000 చొప్పున డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సూచనల మేరకు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట భవానీ, కనకరాజు, మాజీ సర్పంచ్ నెక్కల్ల పెంటయ్య, కర్రి నాయుడు, సిమ్మా అంకుల్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ రుణ మేళా



రుణగ్రహీతలకు రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్న మూర్తి, సిబ్బంది

నర్సీపట్నం: స్థానిక యూనియన్ బ్యాంక్-2లో గురువారం రీటెయిల్ లోన్ మేళా నిర్వహించారు. విశాఖపట్నం డిప్యూటీ రీజనల్ హెడ్ ఐఎస్ఎస్ మూర్తి పాల్గొని రుణగ్రహీతలకు లోన్ రుణ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ వడ్డీకి రీటెయిల్ రుణాలు అందిస్తున్నామన్నారు. బ్రాంచ్ పరిధిలో రూ.కోటి వరకు రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. యూనియన్ బ్యాంక్ శాఖ కల్పిస్తున్న అవకాశాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్లు మాతునాయుడు, శ్రీనివాస్, జయరాం, నానాజీ, రవి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల పోటీల విజేత 'చుక్కపల్లి'



ముత్యమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



పోటీల సందర్భంగా దౌడు తీస్తున్న ఎడ్లు

చోడవరం రూరల్: అన్నవరం వెంకయ్యగారిపేటలో వెలసిన ముత్యమాంబ అమ్మవారి తీర్థం సందర్భంగా నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలో చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి చెందిన అద్దేపల్లి పాలవెల్లి ఎడ్ల జత ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. పోటీలో వివిధ మండలాల నుంచి తరలి వచ్చిన 22 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. చుక్కపల్లి ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచి రూ. 20 వేల నగదు బహుమతి సాధించగా, అర్జునగిరి గ్రామానికి చెందిన ఎడ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 12 వేలు, కశింకోట మండలం కూండ్రం ఎడ్లు తృతీయ బహుమతి రూ. 8 వేలు, చుక్కపల్లి మజ్జి రాజేష్ ఎడ్లు నాల్గవ బహుమతి రూ. 6 వేలు, నర్సయ్యపేట నపరెడ్డి మోక్షిత ఎడ్లు రూ. 4వేలు, లెక్కలవానిపాలెం ఎడ్లు రూ. 2 వేల నగదు బహుమతులు సాధించాయి. పోటీల అనంతరం ఉత్సవ నిర్వాహకులు విజేత ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు. వెలుతురు లేకపోవడంతో గుర్రం పరుగు పోటీలు రద్దు చేశారు. కాగా ముత్యమాంబ అమ్మవారికి గురువారం ఉదయం నుంచి ధూప దీప నైవేద్యాలతో భక్తులు విశేష పూజలు జరిపారు. తీర్థం సందర్భంగా రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

ప్రగతిపథంలో బోయిలకింతాడ



బోయిలకింతాడలో డ్రైనేజీ పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బాబూరావు

దేవరాపల్లి: బోయిలకింతాడ గ్రామం డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సహకారంతో ప్రగతి పథంలో దూసుకుపోతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయడంతో పాటు నాణ్యంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే సుమారు రూ. 6.50 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నామన్నారు. తమ గ్రామాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న డిప్యూటీ సీఎంతో పాటు ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్ విద్యుత్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును గురువారం తారువలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనియన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను డిప్యూటీ సీఎంతో ఆవిష్కరింపజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ డి. బాపిరాజు, కార్యదర్శి ఎల్. తాతబాబు, ఎస్. దేవార్జున, కార్యవర్గ సభ్యులు అప్పారావు, మధు, శివ, నగేష్, ఎస్. శివ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన



ఆక్రమణలను పరిశీలిస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు

మాకవరపాలెం: సాగునీటి గెడ్డ, చెరువు ఆక్రమణలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. మండలంలోని జి.కోడూరు ఉన్నత పాఠశాలలను ఆనుకుని ఉన్న గెడ్డను కొంత మంది ఆక్రమించుకుని దుకాణాలు ఏర్పాటు చేశారు. ఈ విషయంపై ఫిర్యాదు అందడంతో గురువారం ఇరిగేషన్ ఏఈ రవికుమార్, ఆర్‌ఐ కృష్ణమూర్తి ఆక్రమణలను పరిశీలించారు. అలాగే కోదండరామ చెరువు కూడా సుమారు 5 ఎకరాల వరకు ఆక్రమణలకు గురైనట్టు అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలపై పూర్తిస్థాయి సర్వే చేపట్టి తొలగింపునకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ కృష్ణమూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తలెత్తరాదు



మాట్లాడుతున్న ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు

నాతవరం: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చేయడమే ధ్యేయంగా మనమంతా ఐక్యంగా పని చేయాలని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సచివాలయ సిబ్బందితో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ డ్రైనేజీ పనులకు రూ. 50 లక్షలు మంజూరు చేశారన్నారు. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ. 3 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో మండలంలో 14 పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. ఈనెల 15 నుంచి ప్రభుత్వం క్లాప్ ప్రోగ్రాం అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక వాహనం ద్వారా మండలవ్యాప్తంగా పర్యటించి గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్లకు మరమ్మతులు చేస్తారన్నారు. అభివృద్ధి పనుల విషయంలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదన్నారు. మండలంలో జరుగుతున్న పనుల పురోగతిని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజేష్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.